# పెళ్ళాం ఉద్యోగం

పాలకోడేటి సత్యనారాయణరావు



ఇల్లు చేరేసరికి బాగా అలసిపోయాను-ఎక్కువగా పనిచేయటం వల్ల-శారీరకంగానే కాదు, మానసికంగా కూడానూ !!

శారీరక శ్రమ ప్రతిరోజూ ఉండేదే-పని ఉన్నా, లేకపోయినా రోజంతా బందీలా కుర్చీలో కూర్చోవటం కన్నా శ్రమ ఇంకేముంటుంది గనుక? కానీ- ఇదుగో ఇలాటి రోజువస్తే ఎపుడూ ఉండే శారీరక శ్రమతో బాటుగా మానసికంగా కూడా అలసిపోవటం జరుగుతోంది.

ఈరోజు సోమవారం. ఒకటో తారీఖు. గత నెలలో చేసిన పనికి ఈ రోజు ఫలితం అందుకోవటం జరిగింది.

అక్షరాలా అయిదు వందల ఇరవై ఒక్క రూపాయల ఆరు పైసలు ముట్టినట్లుగా రెవిన్యూ స్టాంపులమీద సంతకం చేసి మరీ అందుకొన్నాను.

అందుకోక పూర్వం, అందుకొన్నాక కూడా... అలసటే !

కాగితమూ, కలమూ అందుకొన్నాను—ఇంక మొదలు-కూడికలు, తీసివేతలు! ఎంత మొత్తంలో ఎంత మొత్తం తీసివేస్తే, కొంత మిగులుతుంది అనేదే ఉద్దేశం. దేనికి ఏది కలిపినా, ఏది తీసేసినా-ఆన్సరు మాత్రం ఒకటే వస్తోంది... ఏం చేయాలి?

ఏం లెక్కలు చేస్తే ఈ కోరుకొన్న ఫలితం వస్తుంది?

ఏం చేస్తే ఈ జీవితపు గళ్ళ నుడికట్టు నిండేను??

—తెలీదు.

అందుకే-జీతం అందుకొన్నాక, ఎన్ని లెక్కలు చేసినా, ఎంత అవస్థపడినా లోటు బడ్జెట్ అలాగే వుండిపోతోందేగానీ, ఇంకో విధంగా మారటంలేదు-బడ్జెట్‌తో బాటుగా మారని జీవితమూ !!

—ఇదుగో, అచ్చం ఇలాటి రోజులలోనే నాకు దుర్గంటే ఒళ్ళు మండేది. కనకదుర్గతో కాపురం చేస్తానని ఒప్పుకొన్నానే కానీ, కష్టాలతో కాదుగదా! అయినా సరే, కనకదుర్గ నా ఇంటికి వస్తూ వస్తూ—"ఊర్కే వస్తే

ఏంబాగుంటుంది?'' అనుకొంది కాబోలు, కానిని కష్టాలను అరణం పట్టుకొచ్చింది. అప్పటినుంచీ మొదలు నాకూ కష్టాలకూ దాగుడుమూతల ఆటలు.

కనకదుర్గను అనుకొంటూంటే, మన సెందుకో కలుక్కుమంటుంది !— అయినా తప్పు కనకదుర్గది కాదేమో !

యవ్వనం వళ్ళంతా పుచ్చపువ్వులా విరిసిపోతున్న రోజుల్లో కనకదుర్గ అచ్చం బంగారపు బొమ్మలా ఉండేది. అందంగా, గుంభ్రంగా ఉండే ఆ ముద్దుమోములో కళ్ళే కనపడేవి. ఎక్కడ ఏ వల వేద్దామా అనే ధ్యాసతో ప్రతీక్షణం అటూ ఇటూ తిరుగు త్తే ఆకళ్ళు తమకు తెలీని తప్పులెన్నో చేయనే చేసేవి. ఇదుగో అలాచేసిన తప్పుల్లో మొదటిదే నా గుండెల్లో చేసినగాయం.

ఎంత అందమైన గాయం అది ! మన సంతా ఆక్రమించి నన్ను బీదవాణ్ణిచేసినా, ఎంత గర్వంగా ఉండేది నాకు !

కనకదుర్గ పక్కన నడుస్తోంటే— వాడె

> **అరణ్య ప్రదేశ్**
>
> మధ్యప్రదేశ్‌లో ఉన్నంత అరణ్యా ప్రాంతం మన దేశంలోని ఇంకే రాష్ట్రంలోను లేదు. అయినప్పటికీ, ఏటా రెండుకోట్ల మొక్కలను నాటి పెంచాలనే లక్ష్యంతో మధ్యప్రదేశ్ చాల పెద్దఎత్తున అటవీకరణపథకాన్ని చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం వైశాల్యంలో ముప్పయి ఏడు శాతం భూమి అటవీ ప్రాంతమే. మన దేశంలోని మొత్తం అటవీప్రాంతంలో నాలుగోవంతు మధ్యప్రదేశ్‌లోనే ఉంది.

వడూ, ఆ రంభను పొందిన ఆ రాస్కెల్, అవును, వాడిపేరు మన్మధుడా, ఏం ?— వాడుకూడా నాకు సమవుజ్జీ కాదనిపించేది. నిజమే-కనకదుర్గ నా సాంగత్యం కోరుకొం దంటే... నేనూ కొంచెం గొప్పవాణ్ణేకాబోలు!

ఆ రోజుల్లో నెలలు వారాలుగా, వారాలు రోజులుగా, రోజులు క్షణాలుగా—అంత త్వరగా కాలం నడిచి పోయేదికాదు, సర్రున జారిపోయేది.

జారిన వస్తువు ఎప్పుడైనా ఒకచోట ఆగి పోవాలి కానీ-కాలం మా పెళ్ళి రోజున ఆగి పోయి ఉంటే !— ఆ రోజున ఆగక ఆ తర్వాత నడుస్తూనే ఉంది.

—ఇదుగో, ఇపుడు ఈ క్షణం వెనక్కి తిరిగి చూసుకొంటుంటే ఏం మిగులు కనబడు తోంది ?

కాటుక కళ్ళ అందాలుపోయి కంటికింద నల్లని గీతలు మిగిలాయి. అందాలు అన్నీ చోటు చేసుకొన్న ఆ వంపుసొంపులన్నీ, ఈ రోజున గతాన్ని గుర్తుచేయడానికి మిగిలిన శిధిలాలుగా ఉన్నాయి.

కానీ...వీటన్నిటి నష్టానికి మా ఇద్దరికీ తగినంత లాభంకూడా లేకపోలేదు.

దేశంలో అల్లరంతా వీడేనన్నట్లుగా తయారైన అరుణ్, సృష్టిలో అందం అంతా ఇదే నన్నంతగా ఉన్న జ్యోతి... చాలు. ఇంతకన్నా ఇంకేమి కోరను నేను ??

కానీ...

అవును, ఈరోజు సోమవారం. ఒకటో తారీఖు. గతనెలలో చేసిన పనికి ఫలితంగా ఈరోజు అక్షరాలా అయిదువందల ఇరవై ఒక్క రూపాయల ఆరుపైసలు ముట్టినట్లుగా రెవెన్యూ స్టాంపుల మీద సంతకంచేసి మరీ అందుకొన్నాను.

ఒకటా... రెండా... వచ్చినది అయి దొందల రూపాయలకు పైచిలుకే! నిజం చెప్పాలంటే ఇంత డబ్బుతో రాజాలాగా కాలంగడపొచ్చు. కానీ... అవును, నాకున్న సమస్యలూ అలాటివే.

ఎంత చెట్టుకు అంతగాలి అయితే పర్వా లేదు గానీ, నాకొస్తున్న జీతం నా జీవితానికి, దానితో ముడిపడ్డ మిగతావారి జీవనానికి సరి పోవటంలేదు.

ఆలోచిస్తోంటే తెలుస్తోనే ఉంది-కారణాలు స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి కూడానూ!

...కనకదుర్గ అందం నిజంగా నన్ను బాధపెడుతోంది. పెళ్ళికాక పూర్వం ఆ చూపుల తాకిడికి తట్టుకోలేక సరెండర్ అయిపోయాను. పెళ్ళి అయాక... జీవితం కఠినంగా కఠోర సత్యంలా కళ్ళముందు కద లాడుతూ ఉంటే ఏంచేయాలో తెలీని అయో మయ స్థితిలో పడిపోయాను.

మనకున్న సంప్రదాయాలన్నిటిలో కట్నం చాలా హేయమైనదనే భావం నాది. అందుకే ఆదర్శంగా కనకదుర్గను చేసుకొనే రోజున కట్నం వద్దనీ, పెళ్ళి జరగాల్సింది నాకూ దుర్గకే గానీ, మా ఇద్దరి మధ్యనున్న ఆర్థిక సంబంధానికి కాదనీ... ఇవన్నీ ఆద ర్శాలు ఆచరణలో పెట్టాను.

—ఆదర్శాలు అన్నీ ఆచరణకు కావనీ, అవన్నీ కథల్లోకి, కాకపోతే నిజ జీవితాల్లో ఉపన్యాసాలకూ తప్ప ఇంకెందుకూ పనికి రానేరావని నిర్ణయించుకోవటానికి నాకు అట్టే కాలం పట్టలేదు.

కళ్ళు తెరుచుకొనే సరికి...

ఏముందీ — ఇంటిమధ్యలో తప్పటడు గులు వేస్తూ అరుణ్, కాళ్ళకులడ్డం పడుతూ, పాకుతూ జ్యోతి...

స్పష్టంగా కనబడుతూ వీళ్ళు ఇద్దరూ... కంటికి కనబడకుండా కష్టాలు మాత్రం లెక్కకు మిక్కిలి.

—కళ్ళెత్తి పైకి చూసినా అంతు కన బడని ధరలు, ఇంకా పెరిగి... ఎంత పెరి గినా విరుగుటమాత్రం కనపడదేం?

—చేతికందిన అయిదువందల ఇరవై రూపాయలనీ అమాంతం ఆఖరు చేయడానికి నోరు తెరుచుకొని కూర్చున్న ఖర్చులు. ఒకరి తర్వాత ఒకరికి... పాలవాడికి ఇవ్వా ల్సిన నీళ్ళబిల్లు, బియ్యంవాడికి తీర్చాల్సిన రాళ్ళ బిల్లు, పనిమనిషికి క్రితం నెలలో మానని వారంరోజులకు ఇవ్వాల్సిన నెల జీతం, చాకలి చింపిన షర్టుకు గుర్తుగా వాడికి పారితోషికం... ఇంతేనా?— పెద్దాడికి ఫారెక్స్, చిన్నదానికి అముల్, గ్లాకో్స్— దుర్గకు వీక్‌నెస్‌కు మందు, రిలాక్సేషన్‌కు సినీమా, ఎంటర్‌టైన్‌మెంట్‌కు ఓసారి రవీంద్రభారతికి, చూసివెళ్ళటానికి ఓసారి ఫ్రెండ్ ఇంటికి... ఈకథ ఇలా అంతు లేకుండా... జీతం ఆఖరు అయిపోయినా మిగిలిపోయే ఖర్చులు...

అందరిదీ ఇలాటి బ్రతుకేనా?

అందరికీ ఇదే బాధేనా?

— తెలీదు.

తెలిసిందంతా ఖర్చులు తలకు మించి ఉన్నాయని, రెండుచేతులా సంపాదించగలిగే ఆఫీసు కాకపోవటం ఇంకో దురదృష్టం. కామధేనువు లాంటి కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లోనో, పబ్లిక్‌గానే అన్నీ అమరగలిగే పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ లోనో ఉద్యోగం అయితే బాగుండేది— అదృష్టం అనేది లేదు. ఉండి ఉంటే అయ్యేయస్ ఆఫీసర్ని అయేవాణ్ణేమో!

**ఉత్తమస్త్రీకి వుండవలసిన లక్షణాలేమిటి?**

*సుభద్రలాంటి ముగ్ధత్వం,*
*రుక్మిణిలాంటి సాధ్వీత్వం,*
*సత్యభామలాంటి తలపొగరు*

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో
**—శ్రీమతి కె. రామలక్ష్మి**

—ఛీ...

ఈ రోజు సోమవారం. ఒకటో తారీఖు.

ఇంకోసారి ఇలాటిరోజు రావాలంటే ఇంకా ముప్ఫై రోజులు... కాదు, ముప్ఫై ఒక్క రోజులు...బాబోయ్—

ఇంటికొచ్చాక అయిదారు తెల్లకాగితాల మీద అన్నిరకాల లెక్కలు చేశాక, చూస్తే ఇంకో మూడు నాలుగు వందలు లోటు కనబడుతూనే ఉంది—

...తల్లక్రిందుల తపస్సు చేసినా ఇరవై, ఇరవై అయిదో తారీఖునాటికి ఋణదాత కోసం అన్వేషణ తప్పేటట్లు లేదు.

తలనెప్పిగా ఉంది. "కనకదుర్గ కాఫీ ఇస్తే బాగుండును" అనుకొన్నాను మనసులో.

అనుకొన్న రెండుమూడు నిమిషాలకే కాఫీతోసహా కనకదుర్గ ప్రత్యక్షం అయింది. మనస్సులో సంగతి ఇంత సరిగా కరెక్టుగా గ్రహిస్తున్న కనకదుర్గకు నేను పడుతున్న ఈ "ఆర్థిక వేదన" తెలీకుండా ఉంటుందా? కనీసం ఊహించుకోనైనా లేదా?

కాఫీ తాగుతూ కిటికీలోంచి బయటకు చూశాను.

బయట ప్రపంచం అంతా ఆ క్షణంలో నాకు అందంగా కనబడింది. దానికి కారణం కిటికీలోంచి నాకు దూరాన్నుంచి వస్తున్న కాదంబరి కనబడటమే! కాదంబరి మా ఎదురింటావిడ. అందంగా ఉంటుంది. పాతికేళ్ళు నిండాయోలేదో తెలీదు. చదువులో ఓ డిగ్రీ అందుకొంది- అవునూ, అన్నిటికన్నా ముఖ్యంగా ఆవిడకు ఉద్యోగం ఉంది.

దేవుడిచ్చిన వరం కాదంబరి—ఆమె భర్తకు!... కాకపోతే, అతను స్కూటర్ మీద జామ్మంటూ పోతూఉంటే, వెనుక ఈవిడ అతన్ని సుతారంగా పట్టుకొని, మరింత వయ్యారంగా అతనిమీదకు వాలుతూ సోలుతూ...

అదీ బహుశా అదృష్టం అంటే!— అంతేనా? కాదేమో- కష్టాలతో కాక, కాదంబరితో కాపురం చేయగలగటమే అదృష్టమేమో! అంతేనా? కాదేమో... బహుశా ఈ కాకపోవటాలన్నిటికీ కారణం ఆవిడకున్న ఉద్యోగమేమో!

తప్పు చేశాను.

పెళ్ళి చేసుకోవాలన్న ఉబలాటమేతప్పు సుఖంగా- అక్కర్లేదు, బాదరబందీల్లేక- ఉండాలనే కోరికలో క్షణం ఆలోచించక... గోతిలోకే దిగాను. ఈ రోజున చుట్టూ చూస్తోంటే... నేను చేసినతప్పు రకరకాల ఆకారాల్లో, సమస్యలలో తలెత్తి నర్తిస్తోంది.

దుర్గకూ ఓ ఉద్యోగం ఉండి ఉంటే...?

ఎంత అందమైన ఊహ! దుర్గతో కలిసి ఆఫీసుకు వెళ్ళచ్చు. కలిసే తిరిగిరావచ్చు. ఇంతకుమించీ ఈ కష్టాలన్నిటికీ ఓసారి గుడ్‌బై చెప్పి స్కూటర్, కాకపోతే సుఖాల నెక్కి ప్రయాణం సాగించవచ్చు...

ఇదంతా ఊహ! కానీ ఊహకూడా ఎంత సుఖం ప్రసాదిస్తోంది?

ఈ ఊహ పొరపాటున కూడా కార్య రూపం ధరించలేదు. ఎందుకంటే, కనక

దుర్గ వయస్సు... ఎంతయితేనేం కానీ, గవర్నమెంట్‌వారు మాత్రం ఉద్యోగం ఇవ్వరు...కానీ...కానీ...

ఉహూ- తీరని కోరిక ఇది. తీరని సమస్యలూ ఇవే! ఇదంతా శాఖాచంక్రమణం.

ఈజీ ఛెయిర్‌లోకి ఎప్పుడు చేరానో, ఎప్పుడు నిద్రలోపడ్డానో నాకే తెలీదు.

* * *

తెల్లగ తెల్లవారితే ఇరవై నాలుగో తారీఖు. కానీ తెల్లవారుతుందో, లేదో? ఈ చీకటి నా జీవితంలోకి చుక్కలు చుక్కలుగా రాలి ఎక్కడ నన్నూ నాజీవితాన్నీ వెలుగును చూడనీక ఘనీభవింప జేసేస్తుందోనన్న భయంతోనే...

తెల్లవారింది.

కనకదుర్గముఖం చూస్తేనే తెలుస్తోంది. ఇంట్లోకి ఏవేవో, ఏవేవో కావాలనేది! అన్నిటికీ వెనుక డబ్బు...

ఆఫీసులోకి వచ్చిపడ్డాను. అందర్నీ పరిశీలనగా చూస్తూనే ఉన్నాను. సుబ్బారావు, సురేష్‌కుమార్, చంద్రశేఖరం, రాధాకృష్ణ, వెంకట్రావ్, సుబ్బారాయుడు ... ఉహూ- లాభం లేదు. వీళ్ళెవ్వరూ ఇవ్వగలిగేవాళ్ళు కారు. రాజు... ఔను, రాజు ఇస్తాడేమో!- యాభై-పోనీ నలభై ...ఇరవై అయినాసరే.

లంచ్‌లో అతని దగ్గరకు చేరాను. విషయం విని నవ్వాడు, జేబులోంచి నోట్ల కట్ట ఒకటి తీశాడు.

ఇరవైనాలుగో తారీఖు. అయినా అతని దగ్గర నోట్లకట్ట! దేశంలో డబ్బంతా ఇలా ఒక్కడిదగ్గరే ఉండిపోవటం అన్యాయం! నాకు అసూయగా ఉంది. అదే మాటల రూపంలోకి వచ్చేసింది- "అదృష్టవంతులు మీరు- ఇంకా నోట్లన్నీ అలాగే ఉన్నాయి."

రాజు నవ్వాడు- "అవును, ఈ నెల జీతంలో మొదటిరూపాయి ఇదుగో, ఇప్పుడే ఖర్చుపెడుతున్నాను. ఈ నెల ఇంటిఖర్చు అంతా మా ఒప్పందంప్రకారం నా భార్యది. వచ్చేనెల నాది!"

నవ్వాను- "అన్నానుగా, అదృష్టవంతులు అని!"

"ఆ- అదృష్టమే! నా భార్య ఉద్యోగం ఏమిటో మీకు తెలీందికాదు. టెలిఫోన్ ఆపరేటర్! తనకు నైట్‌డ్యూటీ, నాకు డే డ్యూటీ!- మేం ఇద్దరం మాట్లాడుకొని ఖచ్చితంగా ఎనిమిది రోజులయింది. అదృష్టం అంటే అదృష్టమే మరి!"

నాకు కొరడా దెబ్బల్లా తగిలాయి ఆ మాటలు.

రాజు అన్నది వింటోంటే... నా కళ్ళల్లో రాజు భార్య భర్తకు అందిస్తున్న నోట్లు కనబడుతూనే ఉన్నాయి. అయినా...

అసంతృప్తిగా ఇల్లు చేరాను.

ఇల్లు చేరాక-

కనకదుర్గ నవ్వుతూ పలకరిస్తూ తలుపు తీస్తోంటే, ఆ అసంతృప్తి అంతా పటాపంచలైపోయింది.

దౌర్భాగ్యుణ్ణి! పెళ్ళాం ఉద్యోగం అంటూ కలలు కన్నానేకానీ ఆ కలల స్వరూపం నిజంగా ఇంత దారుణంగా ఉంటుందని తెలీనివాణ్ణి! నిజానికి పెళ్ళాం ఉద్యోగం అంటే ఏమిటో ఈ క్షణంలోనే తెలిసింది నాకు.

ఆపరంగా కనకదుర్గ పిలుస్తోంటే, లోపలికి నడిచాను. *